నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 30 జూన్ 2024 | YADADRI BHUVANAGIRI

## చట్టాలపై నిరంతరం అవగాహన పెంచుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి అర్బన్, జూన్ 29 : నూతనంగా వచ్చే చట్టాలపై న్యాయవాదులు నిరంతరం అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు అన్నారు. భువనగిరి కోర్టులో శనివారం ఏర్పాటు చేసిన ఒక రోజు శిక్షణ తరగతులను ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయవాదులు నిరంతరం విద్యార్థిగా ఉండాలని, చట్టాల పట్ల ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని అన్నారు. కొత్త చట్టాల్లో కొన్ని మార్పులు, చేర్పులు ఉంటాయని, వాటిని తెలుసుకునేందుకు శిక్షణ తరగతుల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్, ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి, న్యాయవాదులు నాగారం అంజయ్య, రాపోలు భాస్కర్, జూకంటి రవీందర్, ఎండీ రహీం, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, జయకృష్ణ, సోమయ్య, జగతయ్య, మోహన్, కుమార్, విజయభాస్కర్ రెడ్డి, ఎండీ నిహాల్, వెంకటేశం, దాసు, విద్యాసాగర్, పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం వసతులు కల్పించాలి

- జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి మాధవీలత


చిల్డ్రన్స్ హోమ్‌లో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ న్యాయమూర్తి మాధవీలత

భువనగిరి అర్బన్, జూన్ 29 : గ్రేస్ చిల్డ్రన్స్ హోమ్‌లో నిబంధనల ప్రకారం వసతులు కల్పించాలని జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవీలత అన్నారు. పట్టణంలోని గ్రేస్ చిల్డ్రన్స్ హోమ్‌ను శనివారం ఆమె సందర్శించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలను అనుసరించాలని, నిర్ణయించిన అనుమతులు పాటించాలని అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ చట్టం, న్యాయ సేవలకు రూపొందించిన పథకాల అమలులో భాగంగా అన్ని బాలల సంరక్షణ హోమ్స్ పరిశీలించబడుతాయని తెలిపారు.

# పచ్చదనంపై పట్టింపేది ?

- నీళ్లు లేక ఎండుతున్న హరితహారం మొక్కలు
- గాలికి వదిలేసిన పల్లె ప్రకృతి వనాలు
- కొండమల్లేపల్లి మండలంలో కొరవడిన పర్యవేక్షణ
- కాంగ్రెస్ సర్కారు తీరుపై విమర్శల వెల్లువ


కొండమల్లేపల్లి పట్టణంలో ఎండుతున్న డివైడర్ మధ్యలోని మొక్కలు

కొండమల్లేపల్లి, జూన్ 29 : రాష్ట్రంలో అంతరించిపోతున్న అడవుల విస్తీర్ణం పెంచడంతోపాటు గ్రామాలు, పట్టణాల్లో పచ్చదనం పెంచేందుకు, వాతావరణ కాలుష్యం నివారణే లక్ష్యంగా కేసీఆర్ సర్కారు హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. తొమ్మిదేండ్లపాటు ప్రతియేటా అడవులు, ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాలతోపాటు ఎక్కడ అవసరమున్నా పెద్ద ఎత్తున మొక్కలు నాటించింది. దాంతో మొక్కలు పెరిగి వృక్షాలుగా మారాయి. దాంతో పచ్చదనం పెరిగి వాతావరణంలో అనుకూల మార్పులు వచ్చాయనడంలో సందేహం లేదు. కానీ కాంగ్రెస్ సర్కారు హరితహారం కార్యక్రమాన్ని పట్టించుకోవడం లేదు. వర్షాలు పడుతున్నా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం లేదు. పైగా గతంలో నాటిన మొక్కలను సంరక్షించడంలోనూ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. పలుచోట్ల ఎండుతున్న మొక్కలే ఇందుకు నిదర్శనం. ప్రతిరోజూ నీటిని పెట్టాల్సిన పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడంతో మొక్కలు బతికే పరిస్థితి లేకుండా పోయింది. రోడ్ల వెంట మొక్కలే కాకుండా పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు ఎండి పచ్చదనం లేకుండా పోతున్నది.

### ప్రత్యేకాధికారుల పాలనలో నిర్లక్ష్యం

హరితహారంలో భాగంగా గత ప్రభుత్వం కొండమల్లేపల్లి మండల వ్యాప్తంగా 26 నర్సరీలను ఏర్పాటు చేసింది. గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్లు ఏర్పాటు చేసి వాటికి ఇరువైపులా మొక్కలు నాటించింది. ఇండ్లలో పెంచేందుకు పూలు, పండ్లు, షో మొక్కలను ఉచితంగా అందజేసింది. 2015 నుంచి 2023 వరకు మండల వ్యాప్తంగా 3.24 లక్షల మొక్కలను నాటించింది. దాంతో పచ్చదనం పెరిగి ప్రజలకు ఆహ్లాద వాతావరణాన్ని అందించింది. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు మొక్కల సంరక్షణను గాలికి వదిలేసింది. కొత్తగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పట్టించుకోవడం లేదు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో నూతనంగా నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్డు డివైడర్ల మధ్యన దాదాపు కిలోమీటర్ వరకు కేసీఆర్ ప్రభుత్వం 450 మొక్కలు నాటించి ట్రీ గార్డులు ఏర్పాటు చేసింది. ఒక్కో మొక్కకు రూ.400 ఖర్చయ్యింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, సిబ్బంది నిర్లక్ష్యంతో మొక్కలు ఎండుతున్నాయి. సర్పంచులు పదవిలో ఉన్నప్పుడు భయానికో భక్తికో వాటిని సంరక్షించే విధంగా పారిశుధ్య కార్మికులను పురమాయించేవారు. ప్రస్తుతం ప్రత్యేక అధికారులు ఉండడంతో పర్యవేక్షించే వారే కరువయ్యారు. నర్సరీల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. కమ్యూనిటీ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్, మల్టీలేయర్ అవెన్యూ ప్లాంటేషన్, బయోఫెన్సింగ్ ప్లాంటేషన్, రోడ్డుసైడ్ ప్లాంటేషన్ పేరుతో నాటిన వేలాది మొక్కలు నిర్వహణ లేక ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టి మొక్కలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

## 15 రోజుల్లో నూతన భవనాలు ప్రారంభిస్తాం

- సర్వేల్ గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి
- ఇక్కడ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే..
- ఎమ్మెల్యేకు సమస్యలు చెప్పుకొన్న విద్యార్థులు


సర్వేల్ గురుకులంలో సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

సంస్థాన్ నారాయణపురం, జూన్ 29 : మండలంలోని సర్వేల్ గురుకుల పాఠశాలలో రూ.20 కోట్లతో నిర్మించిన నూతన భవనాలను 15 రోజుల్లో ప్రారంభిస్తామని, విద్యార్థులకు కావాల్సిన వసతులన్నింటినీ త్వరలోనే కల్పిస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. నమస్తే తెలంగాణ దిన పత్రికలో ఈ నెల 24న ప్రచురితమైన 'సర్వేల్ గురుకులం.. సమస్యలతో సతమతం' కథనానికి ఆయన స్పందించారు. గురుకుల పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకులంలోని విద్యార్థులు ఫ్యాన్లు తిరుగడం లేదని, వాష్‌రూమ్‌కు డోర్లు లేవని, నీళ్లు రావడం లేదని, అన్నం బాగాలేదని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి చెప్పడంతో ఆయన ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనని, పాఠశాలలో నెలకొన్న సమస్యలపై సోమవారం రివ్యూ నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం అత్యవసరంగా కావాల్సిన వసతులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం గురుకులంలో నిర్మించిన నూతన భవనాలను పరిశీలించి కాంట్రాక్టర్ పలు సూచనలు చేశారు. కాంట్రాక్టర్ రూ.7కోట్ల బిల్లు పెండింగ్ ఉందని తెలుపడంతో బిల్లు ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కొత్తగా నిర్మించిన భవనాలు బాగున్నాయని, మరొక డార్మెటరీ నిర్మించడానికి నిధులు కూడా మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. అలాగే సర్వేల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ గుత్తా ఉమాదేవి, జడ్పీటీసీ వీరమళ్ల భానుమతి గౌడ్, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, నాయకులు గుత్తా శేఖర్ రెడ్డి, ఉప్పల లింగస్వామి, వెనుముల శంకర్ రెడ్డి, చిలకరాజు రాజు, సతీశ్, షేక్ షబ్బీర్, ఎల్లంకి చంద్రయ్య పాల్గొన్నారు.


కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు

## మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్లకు హరీశ్‌రావు పరామర్శ

గట్టుప్పల్, జూన్ 29 : అనారోగ్యంతో చికిత్స పొందిన మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం హైదరాబాద్ కొత్తపేటలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కూసుకుంట్ల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పూర్తి ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని తెలిపారు. ఆయన వెంట దేశపతి శ్రీనివాస్, దేవిప్రసాద్ తదితరులు ఉన్నారు.


బీబీనగర్ ఎయిమ్స్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంత్ కె.జెండగే

## ఎయిమ్స్‌లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్, జూన్ 29 : ఎయిమ్స్‌లో కింది స్థాయి ఉద్యోగ నియామకాల్లో స్థానికులకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బీబీనగర్ ఎయిమ్స్‌ను శనివారం వారు సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఓపీ బ్లాక్, ల్యాబ్‌లు, ఐసీయూను, ఎయిమ్స్‌లో జరుగుతున్న పలు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం డైరెక్టర్ వికాస్ భాటియాతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి కావాల్సిన వసతులు కల్పించాలని సూచించారు. ఎయిమ్స్‌లో కింది స్థాయి ఉద్యోగ నియామకాల్లో స్థానికులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ క్రమంలో ఎయిమ్స్ నియామకాల్లో అవినీతిని అరికట్టాలని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రజాప్రతినిధుల వెంట వచ్చిన వారు ప్రశ్నించగా డైరెక్టర్ వికాస్ భాటియాపై వారిపై మండిపడ్డారు.

కార్యక్రమంలో కలెక్టర్ హనుమంత్ కె.జెండగే, నార్నె సంస్థల అధినేత నార్నె గోకుల్, జడ్పీటీసీ గోలి ప్రణీతాపింగళ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణగౌడ్, ఎంపీటీసీలు గోలి నరేందర్‌రెడ్డి, టంటం భార్గవ్, నాయకులు పోటోల్ల శ్యామ్‌గౌడ్, గడ్డం బాల్‌రెడ్డి, పంజాల పెంటయ్య, కాసుల ఆంజనేయులుగౌడ్, బెండె ప్రవీణ్, మంగ లింగేశ్, టంటం రఘు, సామల వేణు, వీరూనాయక్, దండెం ప్రభాకర్ పాల్గొన్నారు.

## సాధారణ ప్రసవాలు పెంచేలా కృషి చేయాలి

- రాష్ట్ర వైద్యారోగ్యశాఖ సంచాలకుడు రవీంద్రనాయక్

భూదాన్ పోచంపల్లి, జూన్ 29 : సిజేరియన్ ప్రసవాలు తగ్గించి, సాధారణ ప్రసవాలు పెంచేలా ఆరోగ్యశాఖ, ప్రైవేట్ ఆస్పత్రుల వారు సమన్వయంతో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకుడు రవీంద్ర నాయక్ అన్నారు. భూదాన్ పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా ప్రోగ్రాం అధికారులకు శనివారం ఆయన జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా శిశు మరణాలను తగ్గించేందుకు ఆశ కార్యకర్తల నుంచి వైద్యాధికారుల వరకు కృషి చేయాలని, గర్భిణులకు సక్రమంగా సేవలు అందేలా చూడాలని అన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు అన్ని రకాల సేవలను అందించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, అలాంటి వాటిని ప్రోత్సహిస్తున్న స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి సబ్ యూనిట్ అధికారి ఏరియా అలాట్ చేసి పర్యవేక్షణ చేయాలని తెలిపారు. గర్భిణులకు బర్త్ ప్లానింగ్‌పై అవగాహన కల్పించాలని, ప్రతి పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పాపారావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు శిల్పిని, యశోద, ప్రోగ్రాం అధికారులు రామకృష్ణ, వంశీకృష్ణ, మండల వైద్యాధికారిని శ్రీవాణి, డీఈఎంఓ మధుసూదన్ రెడ్డి, ఏఎంఓ మధు, హెల్త్ ఎడిటర్స్ సాయి రెడ్డి, సత్యనారాయణ, వసంత, హెచ్‌ఈఓ ఇస్తారి, సీహెచ్‌ఓ పోతారెడ్డి, చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్వేత, సూపర్‌వైజర్స్ అరుంధతి, శ్రీదేవి, ఆరోగ్య కేంద్ర ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


రవీంద్ర నాయక్‌ను సన్మానించిన వైద్యారోగ్య సిబ్బంది

## సుహాసిని మృతి ఘటనలో మూడు దవాఖానల పాపం


మఠంపల్లిలో డాక్టర్ నాగేందర్ హాస్పిటల్‌ను సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

- సూత్రధారి ప్రభుత్వ వైద్యాధికారి నాగేందర్
- విజయ, కమల, నాగేందర్ హాస్పిటళ్లు సీజ్
- డీఎంహెచ్‌ఓ కోటాచలం

మఠంపల్లి/హుజూర్‌నగర్, జూన్ 29 : కలకలం రేపిన రత్నావత్ సుహాసిని మృతి ఘటనలో మూడు ప్రైవేట్ దవాఖానాల పాపం ఉందని, మఠంపల్లిలో ప్రైవేట్ హాస్పిటల్ నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్యుడు నాగేందర్ పాత్రకూడా ఉన్నట్లు సూర్యాపేట జిల్లా వైద్యాధికారి కోటాచలం తెలిపారు. మఠంపల్లిలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని చివ్వెంల మండలానికి చెందిన రత్నావత్ సుహాసినికి మూడో కాన్పు కాగా 7వ నెల తనకు ఆడపిల్ల వద్దని అబార్షన్ చేయాలని భర్త హరిసింగ్ ఆమె భార్యను హుజూర్‌నగర్‌లోని కమల హాస్పిటల్‌కు తీసుకొచ్చాడన్నారు. అక్కడ బేరం కుదుర్చుకొని పిండం కరిగిపోవడం కోసం మందులు వాడడం వల్ల రక్తస్రావం ఎక్కువైందని, దాంతో అక్కడి నుంచి మఠంపల్లిలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారని తెలిపారు. అక్కడ రక్తస్రావం జరుగకుండా ట్యాబ్లెట్స్ బాధితురాలికి ఇచ్చారని, అయినా పరిస్థితి విషమించడంతో కోదాడలోని విజయ హాస్పిటల్ (డాక్టర్ గురవయ్య) తరలించారని చెప్పారు. అక్కడ కూడా పరిస్థితి అలాగే ఉండడంతో అందులో పని చేస్తున్న కాంపౌండర్లు గోపి, సైదులు దగ్గరలో ఉన్న ఒక తోటలోకి తీసుకెళ్లి అక్కడ అబార్షన్ చేస్తున్న క్రమంలో సుహాసినికి రక్తస్రావం ఎక్కువై పిండం బయటకు రాకపోవడంతో ఎక్కువ కేకలు వేయడంతో వారు అక్కడి నుంచి పారిపోయారని అన్నారు. భర్త హరిసింగ్ వెంటనే ఆమెను ఖమ్మం తరలించారని, అక్కడ దవాఖానలో తీసుకోకపోవడంతో హైదరాబాద్‌కు తరలించే క్రమంలో సుహాసిని మృతి చెందిందని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలతో సంబంధం ఉన్న కోదాడ విజయ హాస్పిటల్, హుజూర్‌నగర్ కమల హాస్పిటల్, మఠంపల్లిలోని నాగేందర్ ఆస్పత్రిని సీజ్ చేసినట్లు, ప్రభుత్వ వైద్యాధికారి నాగేందర్‌పై శాఖపరమైన చర్యలు తీసుకోనున్నట్లు డీఎంహెచ్‌ఓ చెప్పారు. త్వరలో పోలీస్ సహకారంతో ఆర్ఎంపీలకు, పీఎంపీలకు అవగాహన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం డీఎంహెచ్‌ఓ కోటాచలం హుజూర్‌నగర్‌లోని కమల హాస్పిటల్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. భ్రూణ హత్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లోని కొంతమంది ఆర్ఎంపీలు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించేందుకు ప్రజలను ప్రోత్సహిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఆయన వెంట జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నిరంజన్, వైద్య శాఖ జిల్లా మీడియా అధికారి అంజయ్య గౌడ్, మండల వైద్యాధికారి సుధాకర్‌నాయక్, వైద్యసిబ్బంది అంజయ్య, కార్తీక్, రామకృష్ణ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# భక్తవత్సలుడు స్వర్ణగిరీశుడు

### తెలంగాణ తిరుపతి స్వర్ణగిరి క్షేత్రం

- అద్భుత శిల్పకళా సంపదతో నిర్మాణం
- నిత్యం స్వామివారికి వివిధ రకాల సేవలు
- నలుమూలల నుంచి వేలాది మంది భక్తుల రాక
- 8వేల మందికి నిత్యాన్నదానం
- త్వరలోనే కాటేజీలు.. సాంస్కృతిక ప్రాంగణం
- ఆలయ ధర్మకర్తలు రామారావు,మురళీకృష్ణ, గోపీకృష్ణ

స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వర క్షేత్రం మినీ తిరుపతిగా విరాజిల్లుతున్నది. యాదాద్రి భువనగిరి జిల్లాలో మరో ప్రముఖ పుణ్యక్షేత్రమై అలరారుతున్నది. భక్తులకు కొంగుబంగారంగా నిలుస్తున్నది. స్వామి వారి దర్శనానికి వచ్చే ప్రతి ఒక్కరికీ దివ్య దర్శన భాగ్యం కల్పించడంతోపాటు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ధర్మకర్తలు చెప్తున్నారు.

– యాదాద్రి భువనగిరి, జూన్ (నమస్తే తెలంగాణ)


అత్యద్భుతంగా దర్శనమిస్తున్న స్వర్ణగిరి వేంకటేశ్వరాలయం

స్వర్ణగిరి ఆలయాన్ని ధర్మకర్తలు మానేపల్లి రామారావు, ఆయన కుమారులు మురళీకృష్ణ, గోపీకృష్ణ నిర్మించారు. స్థపతి డీఎన్‌వీ ప్రసాద్ పర్యవేక్షణలో ఆలయాన్ని నిర్మించారు. 22 ఎకరాల్లో ఉన్న క్షేత్ర నిర్మాణానికి దాదాపు ఏడేండ్ల సమయం పట్టింది. మార్చి 6న స్వామివారి దర్శన భాగ్యం భక్తులకు కల్పించారు. స్వర్ణగిరి వేంకటేశ్వరుడి విగ్రహం 16 అడుగుల ఎత్తు కాగా, త్రిదండి చినజీయర్ స్వామి శాస్త్రోక్తంగా ప్రాణప్రతిష్ఠ చేశారు. 108 విష్ణు ఆలయాల నుంచి సేకరించిన మట్టి, నీరు స్వామి వారి విగ్రహం కింద ఉంచి.. వేంకటేశ్వరుడిని ప్రతిష్ఠించారు. నిత్యం స్వామి వారికి అన్ని రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రం నలుమూల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. 100 రోజుల్లోనే 46లక్షల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

### ఎన్నో విశిష్టతలు..

ఆలయంలోకి అడుగు పెట్టగానే స్వామి వారి పాదాలు దర్శనమిస్తాయి. అక్కడి నుంచి గర్భగుడి వైపు 108 మెట్ల మార్గం ఉంటుంది. అలాగే స్వామివారి దశావతార రూపాలను మెట్ల మార్గంలో మంటపాలుగా నిర్మించారు. విగ్రహాలను పాలరాతితో ఎంతో సుందరంగా చెక్కారు. మెట్ల మార్గం దాటగానే గర్భగుడికి సమీపంలో బ్రహ్మరథం దర్శనమిస్తుంది. గర్భగుడిలోకి ప్రవేశించే ముందు గోపురాలను గమనిస్తే భాగవతం మొత్తం మన కండ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. గర్భగుడిలో వెలసిన సువర్ణమూర్తి స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామిని చూసినంతనే మనసంతా భక్తిభావంతో నిండిపోతుంది. అనంతరం సువర్ణమూర్తిగా అమ్మవారిని దర్శించుకోవచ్చు. గర్భగుడి వెలుపలకు రాగానే తిరుపతిలో మాదిరిగా విమాన వేంకటేశ్వర స్వామిని చూడవచ్చు.

### అద్భుత శిల్పకళ..

క్షేత్రంలో ఉన్న స్తంభాలు వేటికవే ప్రత్యేకమైనవి. గుడిలో సిమెంట్‌ను ఉపయోగించలేదు. రాతి కట్టడాలు, ఇంటర్‌లాకింగ్ పద్ధతుల్లో నిర్మించారు. ద్రావిడ శైలిలో నిర్మించిన ఆలయంలో పల్లవ, విజయనగర, చోళ, చాళుక్యుల నాటి కళా నైపుణ్యం కనిపిస్తుంది. ఒక్కో స్తంభం ఒక్కో రూపంలో ఉంటుంది. ఆలయం బయట 120 అడుగుల హనుమాన్ ఏకశిలా విగ్రహాన్ని నెలకొల్పారు. ఈ విగ్రహాన్ని చెక్కడానికి ఐదేండ్ల సమయం పట్టింది. 1,500 కేజీల బరువున్న జయ గంటను ఇక్కడ చూడవచ్చు. ఒక్క సారి మోగిస్తే మూడు నిమిషాల పాటు దాని తరంగాలు ప్రతిధ్వనిస్తాయి. ప్రపంచంలో ఎక్కడా లేని మదన గోపాలుడి విగ్రహాన్ని చూడవచ్చు. పది చేతులతో ఉన్న విగ్రహాన్ని దర్శించుకోవచ్చు. ఆలయంలో మరో ప్రత్యేక కోనేరు. ప్రపంచంలోనే రెండో జలనారాయణుడి విగ్రహం ఇక్కడ ఉంది. స్వామి వారు ఆకాశాన్ని చూస్తున్నట్లుగా ఉంటుంది. నేపాల్ తర్వాత ఇక్కడ కొలువుదీరిందని ఆలయ ప్రతినిధులు తెలిపారు. దీని బరువు 2,500 కిలోలు. ఈ కోనేరు నాలుగు మూలల్లోనూ నాలుగు వేదాలకు ప్రతీకైన విగ్రహ మండపాలు కనిపిస్తాయి. ఒకేసారి 1,200 మంది కూర్చుని స్వామివారి కల్యాణాన్ని తిలకించే వీలుగా కల్యాణ మండపం నిర్మించారు. స్నాన ఘట్టాలు, కల్యాణ కట్ట, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రాంగణం నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి,

### భక్తులకు ఇబ్బందులు లేకుండా సదుపాయాలు.

ఊహించిన దాని కంటే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో ఆ మేరకు సదుపాయాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. తాగునీరు, టాయిలెట్లు సరిపడా ఏర్పాటు చేశామని, వృద్ధులకు వీల్‌చైర్లు అందుబాటులో ఉంచామని చెప్పారు. రోజూ 8వేల నంచి 10వేల మందికి నిత్యాన్నదానం చేస్తున్నట్లు పేర్కొనారు. శాశ్వత వీధి దీపాలు, రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా వచ్చే నెలలో కాటేజీలు ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. భక్తుల భద్రత కోసం పోలీసులతో సమన్వయం చేసుకుంటున్నట్లు చెప్పుకొచ్చారు. ఆర్టీసీ హైదరాబాద్, యాదగిరిగుట్ట నుంచి రోజూ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.


స్వర్ణగిరి ఆలయంలో జలనారాయణుడు

### ఆన్‌లైన్‌లో అందుబాటులో ఆర్జిత సేవలు..

స్వర్ణగిరీశుడికి ఆర్జిత సేవలు పూర్తి స్థాయిలో భక్తులకు అందుబాటులోకి వచ్చాయి. ఉదయం 5గంటల ప్రారంభమయ్యే సుప్రభాత సేవ మొదలుకొని ఏకాంత సేవ వరకు 16 ఆర్జిత సేవలను www.ytdtemple.com అనే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవచ్చు. మధ్యాహ్నం 1.30 నుంచి 2.30గంటల వరకు మాత్రమే విరామం ఉంటుంది. శని, ఆదివారాల్లో ఉదయం 8 నుంచి రాత్రి 9గంటల వరకు నిరంతరాయంగా స్వామివారిని దర్శించుకోవచ్చు.

### భక్తులకు స్వామివారి దివ్యదర్శనమే లక్ష్యం..



వేంకటేశ్వరస్వామికి సేవ చేసుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాం. మేం అనుకున్న దానికంటే 10 రెట్లు భక్తుల తాకిడి పెరిగింది. రద్దీకి అనుగుణంగా సదుపాయాలు కల్పిస్తున్నాం. భక్తులకు ఇబ్బంది కలుగకుండా స్వామివారి దివ్య దర్శనం కల్పించడమే మా లక్ష్యం. మిగిలిపోయిన ఇతర పనులను త్వరలోనే పూర్తి చేస్తాం. ఆర్జిత సేవలను కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చాం. త్వరలోనే మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

- మానేపల్లి మురళీ కృష్ణ, స్వర్ణగిరి ఆలయ ధర్మకర్త